# భారత్‌తో అన్నీ బంద్!

## 'సిమ్లా ఒప్పందం' సహా పలు ఒప్పందాలు నిలిపివేత

- వాఘా సరిహద్దు మూసివేత.. వీసాలు రద్దు
- 30లోగా దేశం వీడాలని భారతీయులకు ఆదేశం
- భారతీయ ఎయిర్‌లైన్స్‌కు పాక్ గగనతలం మూసివేత
- భారత్ హైకమిషన్‌లో రక్షణ సలహాదారుల బహిష్కరణ
- ఇస్లామాబాద్‌లో భారత దౌత్య సిబ్బంది సంఖ్య తగ్గింపు
- భారత్‌పై పాక్ ప్రతీకార చర్యలు



పాక్ ప్రధాని షెహబాజ్

ఇస్లామాబాద్, ఏప్రిల్ 24: జమ్ము కశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడికి ప్రతిచర్యగా భారత్ పాకిస్థాన్‌పై దౌత్యపరమైన చర్యలను ప్రకటించిన మరుసటి రోజు పాకిస్థాన్ కూడా భారత్‌పై ప్రతీకార చర్యలను ప్రకటించింది. వాఘా సరిహద్దును మూసివేయడంతోపాటు భారత జాతీయులకు సార్క్ వీసాలను రద్దు చేయడం, భారతీయ ఎయిర్‌లైన్స్‌కు తన గగనతలాన్ని మూసివేయడం వంటి వరుస చర్యలను పాక్ ప్రకటించింది. సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన పాక్.. కశ్మీరుపై అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు భారత్ కట్టుబడతామని ప్రకటించేంత వరకు ఆ దేశంతో అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

**భారత్‌తో వాణిజ్యం బంద్**

భారత్ దౌత్యచర్యలకు ప్రతీకారంగా పాకిస్థాన్ గురువారం పలు కీలక చర్యలు చేపట్టింది. తక్షణమే వాఘా సరిహద్దును మూసివేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మార్గంలో భారత్ నుంచి జరిగే రవాణాను సస్పెండ్ చేసింది. చట్టబద్ధమైన పత్రాలతో వాఘా ద్వారా పాకిస్థాన్‌లోకి ప్రవేశించిన భారతీయులందరూ ఏప్రిల్ 30 లోగా స్వదేశానికి వెళ్లిపోవాలని పాక్ ఆదేశించింది. సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం(ఎస్‌వీఈఎస్) కింద భారతీయులకు జారీ చేసిన వీసాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన పాక్.. ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపింది. ఈ పథకం కింద పాక్‌లో ప్రస్తుతం ఉంటున్న భారతీయులందరూ 48 గంటల్లో దేశం విడిచిపోవాలని ఆదేశించింది. భారతీయ ఎయిర్‌లైన్స్‌కు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు తెలిపింది. తృతీయ దేశాల ద్వారా జరిగే వాణిజ్యంసహా భారత్‌తో అన్ని రకాల వాణిజ్యాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇస్లామాబాద్‌లోని భారతీయ రక్షణ, నౌకాదళ, వైమానిక సలహాదారులు ఏప్రిల్ 30 లోగా తమ దేశాన్ని వీడాలని ఆదేశించింది. హై కమిషన్‌లో వారి పదవులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెలాఖరుకల్లా ఇస్లామాబాద్‌లోని భారతీయ హైకమిషన్‌లోని సిబ్బంది సంఖ్యను 30కి తగ్గించినట్లు తెలిపింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన సమావేశమైన జాతీయ భద్రతా కమిటీ సమావేశం అనంతరం జారీచేసిన ప్రకటనలో భారత్ తమకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాలను ఏకపక్షం, అన్యాయం, రాజకీయ దురుద్దేశంతో తీసుకున్నవిగా పాక్ ప్రభుత్వం అభివర్ణించింది. వీటికి చట్టపరమైన అర్హత లేదని పేర్కొంది.

### క్షిపణి పరీక్షల్లో పాక్!

**సైన్యం సెలవులు రద్దు**

పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. ఉగ్రఘటన నేపథ్యంలో భారత్ దాడులు చేసే అవకాశం ఉన్నదన్న కారణంతో క్షిపణి పరీక్షలకు సిద్ధమైంది. ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే క్షిపణి పరీక్షలను నిర్వహించనున్నట్టు పాక్ మిలిటరీ నోటమ్ (నోటీస్ టూ ఎయిర్‌మన్) తెలిపింది. శుక్రవారంనాడు ఈ పరీక్షలు ఉండనున్నట్టు తెలుస్తోంది. 480 కిలోమీటర్ల మేర పరిధిలోని లక్ష్యాలను నాశనం చేయగల క్షిపణులను పాక్ పరీక్షించే అవకాశం ఉన్నదని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా, భారత్ దాడి చేస్తే తిప్పికొట్టడానికి అప్రమత్తంగా ఉండాలంటూ సైన్యాధికారులకు ఆదేశాలనిచ్చిన పాక్.. కీలక అధికారులకు సెలవులను రద్దు చేసినట్టు తెలిసింది. మరోవైపు, ఉగ్రదాడులు జరిగిన వెంటనే పాకిస్థాన్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్‌లు భారత సరిహద్దుల్లో చక్కర్లు కొట్టినట్టు సమాచారం.

### ఇది జల యుద్ధమే

**సింధూ జలాల ఒప్పందం నిలిపివేతపై పాక్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగదాడి దరిమిలా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేయాలని భారత్ తీసుకున్న నిర్ణయాన్ని జల యుద్ధంగా, చట్ట వ్యతిరేక చర్యగా పాకిస్థాన్ అభివర్ణించింది. ఈ నిర్ణయాన్ని న్యాయపరంగా సవాలు చేస్తామని పాక్ ప్రకటించింది. ఒప్పందం ప్రకారం తమకు లభించే ప్రతి నీటి బొట్టు తమకే చెందుతుందని పాక్ స్పష్టం చేసింది. భారత్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని జల యుద్ధ, పిరికిపంద, చట్ట వ్యతిరేక చర్యగా పాకిస్థాన్ ఇంధన శాఖ మంత్రి అవాయిస్ అఘారీ ఆరోపించారు. పహల్గాంలో 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు హత్యచేసిన ఘటనకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వం ప్రకటించిన చర్యలను అంచనా వేసేందుకు పాకిస్థాన్‌కు చెందిన అత్యున్నత భద్రతా సంస్థ నేషనల్ సెక్యూరిటీ కమిటీ(ఎన్ఎస్‌సీ) సమావేశమైంది. 1960 దశకంలో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో కుదిరిన సింధూ జలాల ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌లో ప్రవేశించే సింధూ జలాలలో 80 శాతం ఎగువన ఉన్న దేశమైన భారత్ నుంచే అందుతున్నాయి. ఈ నీటి ఒప్పందాన్ని నిలిపివేయడం వల్ల పాకిస్థాన్‌కు చెందిన వ్యవసాయ రంగంపై దీని ప్రభావం తీవ్రంగా ఉండనుంది. ఉగ్రదాడికి సంబంధించి పాకిస్థాన్‌పై భారత్ చేసిన ఆరోపణలను నిరాధారంగా పాక్ విదేశాంగ మంత్రి ఇషాఖ్ దర్ తోసిపుచ్చినట్లు పాక్ మీడియా పేర్కొంది. తన స్వీయ వైఫల్యాలకు పాక్‌ను నిందించడానికి భారత్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. భారత్ ఒత్తిడి ఎత్తుగడలకు పాక్ లొంగబోదని రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ప్రకటించారు.



### పాక్ అదుపులో భారత జవాన్

- పొరపాటున ఆ దేశ భూభాగంలోకి ప్రవేశం
- విడుదలకు చర్చలు జరుపుతున్న భారత ఆర్మీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్ ఒకరిని పాకిస్థాన్ రేంజర్స్ తమ అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్‌లో బుధవారం మధ్యాహ్నం అంతర్జాతీయ సరిహద్దు (ఐబీ)ని పొరపాటున దాటిన పీకే సింగ్ అనే కానిస్టేబుల్‌ను వారు అదుపులోకి తీసుకున్నారు. 182 బీఎస్ఎఫ్ బెటాలియన్‌కు చెందిన సింగ్ పశ్చిమ బెంగాల్ వాసి. ఫిరోజ్‌పూర్‌లో ఇండో-పాక్ సరిహద్దు వద్ద ఆయన కొంతమంది రైతులతో కలిసి అనుకోకుండా భారత సరిహద్దును దాటి పాక్ ప్రాంతంలోకి అడుగుపెట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా, సైనికుడిని విడిపించడానికి భారత ఆర్మీ అధికారులు పాకిస్థాన్ రేంజర్లతో ఫ్లాగ్ మీటింగ్ జరిపారు. ఇలాంటి సంఘటలు అసాధారణం కాదని, గతంలో కూడా ఇలాంటివి జరిగాయని అధికారులు పేర్కొన్నారు. పౌరు లు కానీ, జవాన్లు కానీ ఇలా అనుకోకుండా అవలి దేశ సరిహద్దులోకి వెళ్లిన సందర్భాల్లో ఇరుదేశాల అధికారులు మిలిటరీ ప్రొటోకాల్ ప్రకారం ఫ్లాగ్ మీటింగ్‌ల ద్వారా సమస్యను పరిష్కరించుకుంటారు. అయితే పహల్గాం ఉదంతం తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ఆంక్షలు విధించిన క్రమంలో ఈ పరిణామం ఎక్కడికి దారి తీస్తుందోనన్న ఆందోళన వ్యక్తం అవుతున్నది.పాక్ రేంజర్లకు పట్టుబడిన సమయంలో సాహు యూనిఫాంలో ఉన్నారని, అతని వద్ద సర్వీస్ రైఫిల్ కూడా ఉన్నట్టు అధికారులు చెప్పారు. పహల్గాం ఘటనకు దీనిని పాక్ ముడిపెడుతుందా అని భారత్ సందేహపడుతున్నది.

# భద్రతా లోపాలు నిజమే

## పహల్గాం ఉగ్ర దాడిపై అమిత్ షా ఒప్పకోలు

- ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయండి: పార్టీలు
- అఖిలపక్షంతో కేంద్ర ప్రభుత్వం సమావేశం



ఉగ్రదాడి బాధితులకు అఖిలపక్ష సమావేశంలో సంతాపం తెలుపుతున్న నేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్ర దాడిలో భద్రతా లోపాలు ఉన్న మాట నిజమేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఒప్పుకున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. 'తప్పు జరగకపోయి ఉంటే మనం ఇక్కడ ఎందుకు కూర్చుంటాము? ఎక్కడో కొన్ని లోపాలు జరిగాయి. అవి ఏమిటో మనం కనిపెట్టాల్సి ఉంది' అని సమావేశంలో ప్రతిపక్ష నాయకుల వద్ద అమిత్ షా వ్యాఖ్యానించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడిపై గురువారం నాడిక్కడ ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించింది. భద్రతా వైఫల్యాల గురించి ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీసినట్లు తెలుస్తోంది. 'భద్రతా దళాలు ఎక్కడున్నాయి? సీఆర్‌పీఎఫ్ ఎక్కడ ఉంది?' అని పలువురు నాయకులు ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జూన్‌లో అమర్‌నాథ్ ప్రారంభమయ్యే వరకు సాధారణంగా ఎవరికీ ప్రవేశం ఉండని బైసరాన్ ప్రాంతాన్ని తెరచిన సంగతి స్థానిక అధికారులు భద్రతా దళాలకు ముందుగా తెలియచేయలేదని ప్రభుత్వం జవాబిచ్చినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన తర్వాత స్పందించడంలో జరిగిన జాప్యంపై కూడా ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయని ఆ వర్గాలు తెలిపాయి. దీనికి అధికారులు వివరణ ఇస్తూ బైసారన్ ప్రాంతానికి చేరుకోవాలంటే పర్వత మార్గంలో45 నిమిషాలు ప్రయాణించాల్సి ఉంటుందని, ఇటువంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి తమకు స్పష్టమైన నియమ నిబంధనలు ఏమీ లేవని తెలియచేశారు.

**ఉగ్రవాదంపై పోరులో అండగా ఉంటాం..**

ఉగ్రవాద సమస్యను ఎదుర్కోవడంలో సంపూర్ణ సహకారం అందజేస్తామని ప్రభుత్వానికి ప్రతిపక్షాలు హామీ ఇచ్చాయి. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని పార్టీలకు అతీతంగా ఎంపీలు అందరూ ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష సమావేశంలో కేంద్రం హామీ ఇచ్చింది. జమ్ముకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో ఈ ఉగ్రదాడి జరిగిందని కేంద్ర మంత్రి రిజిజు తెలిపారు.

### ఆపరేషన్ ఆక్రమణ్

**ఫైటర్ జెట్లతో ఐఏఎఫ్ విన్యాసాలు**



భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో భారతీయ వైమానిక దళం(ఐఏఎఫ్) గురువారం సెంట్రల్ సెక్టార్ వ్యాప్తంగా ఆపరేషన్ ఆక్రమణ్ పేరిట భారీ స్థాయిలో వైమానిక విన్యాసాలు నిర్వహించింది. రాఫెల్ జెట్ల సారథ్యంలో ఐఏఎఫ్ తన యుద్ధ విమానాల సామర్థ్యాన్ని ప్రదర్శించింది. హర్యానాలోని అంబాలా, పశ్చిమ బెంగాల్‌లోని హాషిమారాలో రెండు రాఫెల్ స్క్వాడ్రన్లను ఐఏఎఫ్ నిర్వహిస్తోంది. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన రాఫెల్ యుద్ధ విమానాలు ప్రస్తుత వైమానిక విన్యాసాలలో కీలక భూమికను పోషిస్తున్నాయి. చదునుగా ఉన్న ప్రదేశాలు, పర్వత ప్రాంతాలతో సహా భిన్న భూ స్వరూపాలు కలిగిన ప్రదేశాలపై వైమానిక దాడులకు సంబంధించిన విన్యాసాలు ప్రస్తుతం జరుగుతున్నట్లు వారు చెప్పారు. జమ్ము కశ్మీరులోని పహల్గాంలో ఇటీవల ఉగ్ర దాడి జరిగిన దరిమిలా భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన వేళ ఐఏఎఫ్ ఆపరేషన్ ఆక్రమణ్ చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ విన్యాసాలలో 'టాప్ గన్స్' పాల్గొంటున్నాయని, హై క్వాలిఫైడ్ ఇన్‌స్ట్రక్టర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న వీటిని ఐఏఎఫ్ ప్రధాన కార్యాలయం అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోందని ఐఏఎఫ్ పైలట్లు వెల్లడించారు.

### ఇటు సూరత్.. అటు విక్రాంత్!

**ఉద్రిక్తతల వేళ భారత నేవీ అప్రమత్తం**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పాక్‌తో ఉద్రిక్తతల వేళ భారత నేవీ కూడా అప్రమత్తమైంది. తాజాగా గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ సూరత్ తొలిసారిగా గగనతలంలో వస్తున్న సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. 70 కిలోమీటర్ల రేంజ్‌లో లక్ష్యాన్ని కూల్చేసింది. ఈ మేరకు నౌకాదళం ఓ వీడియోను విడుదల చేసింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతి తక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లను, క్షిపణులను సీ స్కిమ్మింగ్ టార్గెట్లుగా పిలుస్తారు. మరోవైపు, అరేబియా సముద్రంలో విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ తన గస్తీని మొదలుపెట్టింది. కర్ణాటకలోని కార్వార్ పోర్టు సమీపంలో విక్రాంత్ గస్తీని ముమ్మరం చేసినట్టు ఉపగ్రహ ఛాయా చిత్రాలను బట్టి తెలుస్తున్నది. పహల్గాం దాడి నేపథ్యంలోనే నేవీ యుద్ధ నౌకలను మోహరించినట్టు పలువురు అభిప్రాయపడుతున్నారు.

### కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. జవాన్ వీర మరణం

జమ్ము: వైట్ నైట్ క్రాప్స్‌కు చెందిన సైనికుడు ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీర మరణం పొందాడని సైన్యాధికారులు గురువారం వెల్లడించారు. ఉధంపూర్ జిల్లా డుడు-బసంత్‌ఘర్ ప్రాంతంలో ఉగ్రవాదులున్నారన్న సమాచారంలో తాము సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించామని నైట్ క్రాప్స్ ఎక్స్‌లో తెలిపింది. 'ప్రారంభ ఘర్షణలో మా ధైర్యవంతుడైన సైనికుడు ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. దవాఖానలో ఉత్తమ వైద్యం అందించినా అతడు చనిపోయాడు. ప్రత్యేక దళం 6 పారాకు చెందిన హవల్దార్ జంటు అలీ షేక్‌గా అతడిని గుర్తించాం' అని భారత సైన్యం పేర్కొంది. ఉగ్రవాదుల వేట కొనసాగుతున్నదని తెలిపింది.

### ఉగ్రవాదుల సమాచారమిస్తే రూ.20 లక్షలు

జమ్ము: పహల్గాం దాడికి పాల్పడ్డ ఉగ్రవాదుల సమాచారం తెలియజేసిన వారికి రూ.20 లక్షలు బహుమతిగా ఇస్తామని జమ్ముకశ్మీర్ పోలీసులు గురువారం ప్రకటించారు. ఈ మేరకు అనుమానితులుగా భావిస్తున్న ముగ్గురు వ్యక్తుల స్కెచ్‌లతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. లష్కరే తాయిబా (ఎల్ఈటీ)కి చెందిన ఈ ముగ్గురిలో అదిల్ హుస్సేన్ థోకర్ అనంత్‌నాగ్ వాసి కాగా, అలీ భాయ్ అక తల్హా భాయ్, హాషీమ్ ముసాల అకా సులేమాన్‌లు పాకిస్థానీలు.

### తెలంగాణలో హై అలర్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర నిఘా వర్గాలు ఆయా రాష్ట్రాలను అప్రమత్తం చేశాయి. దేశ వ్యాప్తంగా మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని చెప్పడంతో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే గుర్తించిన స్లీపర్‌సెల్స్‌పై నిరంతరం నిఘా పెట్టాలని ఇంటెలిజెన్స్ విభాగానికి ఆదేశాలు ఇచ్చారు. అలాగే హైదరాబాద్‌లో పోలీసుల గస్తీని ముమ్మరం చేయాలని రాష్ట్ర పోలీసు శాఖను కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించినట్లు తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో హెచ్ఐసీసీ కేంద్రంగా 'భారత్ సమ్మిట్-2025', మే 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్-2025 పోటీలు జరగనున్న క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

### పాక్ ఎంబసీలోకి కేక్ బాక్సు!

**వేడుకల కోసమేనా?.. వీడియోపై నెట్టింట చర్చ**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: జమ్ముకశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన అమానుష దాడిని యావత్ ప్రపంచం ఖండిస్తున్న వేళ న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్‌లోకి ఓ వ్యక్తి కేక్ బాక్సు పట్టుకుని వెళ్లడం చర్చనీయాంశమైంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. హై కమిషన్ వెలుపల ఉన్న జర్నలిస్టుల ప్రశ్నలకు జవాబివ్వకుండా కేక్ బాక్సుతో ఆ వ్యక్తి లోపలకు వెళ్లిపోయాడు. 25 మంది భారతీయులు, ఓ నేపాల్ జాతీయుడిని బలిగొన్న పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా దేశం యావత్తు విషాదంలో మునిగి ఉండగా పాక్ హై కమిషన్‌లోకి కేక్ వెళ్లడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ హై కమిషన్ వెలుపల పాకిస్థాన్ ముర్దాబాద్ అంటూ నిరసనకారులు నినాదాలు చేస్తున్న సమయంలో ఈ వీడియో ప్రత్యక్షమైంది. పాక్ ఎంబసీలో ఏవైనా వేడుకలు జరుగుతున్నాయా అని ఓ నెటిజన్ ఆగ్రహంతో ప్రశ్నించగా, ఎవరిదో పుట్టినరోజు అయి ఉండవచ్చని మరో నెటిజన్ ఈ వీడియోను తేలికగా తీసిపారేశాడు.

### రాష్ట్రపతి ముర్ముతో అమిత్ షా, జైశంకర్ భేటీ

**పహల్గాం దాడి గురించి వివరించిన నేతలు**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: పహల్గాం ఉగ్రదాడితో పాకిస్థాన్, భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో గురువారం సమావేశమయ్యారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించిన పలు అంశాలను వారు ఆమెకు వివరించినట్టు సమాచారం. ఈ భేటీకి సంబంధించిన ఫొటోను రాష్ట్రపతి తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అలాగే పహల్గాం దాడి నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ చైనా, కెనడా సహా జీ20 దేశాల ఎంపిక చేసిన రాయబారులతో సమావేశం జరిపింది.

### 3 స్పాట్‌లు.. 10 నిమిషాలు.. ఐదుగురు ముష్కరులు

**పహల్గాం ఉగ్రదాడిలో వెల్లడవుతున్న నిజాలు**

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తు సంస్థలు వెల్లడించిన వివరాల ప్రకారం కనీసం ఐదుగురు సభ్యులతో కూడిన ముష్కర మూక ఈ దారుణంలో పాలుపంచుకుంది. గడ్డిమైదానాన్ని ఆనుకుని ఉన్న దేవదారు చెట్లతో ఉండే అటవీ ప్రాంతం నుంచి ముందు నిర్దేశించుకున్న విధంగా పర్యాటకులు అధిక సంఖ్యలో ఉండే మూడు ప్రాంతాలకు ముష్కరులు చేరుకున్నారు. వీరివద్ద రైఫిళ్లతో పాటు జరిగిన దృశ్యాలను రికార్డు చేయడానికి బాడీ కెమెరాలు కూడా ఉన్నాయి. మధ్యాహ్నం 1.50 గంటలకు మొదటి ఫైరింగ్ చోటుచేసుకుంది. ఒక్కసారిగా ఉగ్రవాదుల కాల్పులు జరగడంతో పర్యాటకులు భీతావహులయ్యారు. వారు ఒక్కో పర్యాటకుడి వద్దకు వెళ్లి వారి మతాన్ని అడిగి, వారికి ఇస్లామిక్ పద్య పరీక్ష నిర్వహించి నిర్ధారించుకున్న తర్వాతే కాల్చి చంపారు. 10 నిమిషాల పాటు ఈ నరమేధం సాగింది. తర్వాత వారు వచ్చిన దారిలోనే అటవీ మార్గం గుండా పారిపోయారు. ఈ దాడి జరిగిన సుమారు అరగంట తర్వాత 2.30 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. అయితే అక్కడకు చేరుకోవడానికి వాహన మార్గం లేకపోవడంతో కాలినడకన, లేదా గుర్రాలపై అక్కడికి చేరుకోవాలి. దీంతో పోలీసులు ఘటనాస్థలికి మూడు దాటిన తర్వాతే చేరుకున్నారు. కాల్పులకు గురైనవారు కొంతసేపు ఊపిరితోనే ఉన్నారని, అత్యవసర చికిత్స అంది ఉంటే కొందరైనా బతికి ఉండేవారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

### మతం కన్నా మానవత్వం ముఖ్యం

**బాధితులను వీపుపై ఎక్కించుకుని తరలించిన ముస్లిం వ్యాపారి**



శ్రీనగర్: మతం ఆధారంగా కొందరు ముష్కరులు పహల్గాంలో నరమేధానికి దిగగా, మతం కన్నా మానవత్వమే ముందుండాలని నిరూపించారు స్థానికులు. 'మా జీనవాధారానికి కారణమైన వారిని అలా చూసి కన్నీళ్లు ఆగలేదు. అందుకే మా ప్రాణాలు ఏమైనా పర్వాలేదనుకుని గాయపడ్డ వారిని రక్షించిడానికి ప్రయత్నించాం' అని స్థానిక శాలువాల వ్యాపారి సాజద్ అహ్మద్ భట్ పేర్కొన్నారు. గాయపడ్డ వారిని వీపుపై ఎక్కించుకుని దవాఖానకు తరలించి మతం కంటే మానవత్వం ముఖ్యమని నిరూపించారు. బైసరాన్‌లో పర్యాటకులను రక్షించడానికి అవసరమైన సహాయం అందించాలంటూ పోనీ అసోసియేషన్ అధ్యక్షుడు పెట్టిన మెసేజ్ చూసి వెంటనే అక్కడకు చేరుకున్నానన్నారు. గాయపడ్డ వారికి మంచినీరు అందించి గాయపడి, నడవలేని స్థితిలో ఉన్న వారిని వీపుపై ఎక్కించుకుని అక్కడి నుంచి తీసుకువచ్చినట్టు భట్ తెలిపారు. 'మతం కన్నా మానవత్వం ముందు వస్తుంది. పర్యాటకులు మా అతిథులు. వారిని గౌరవించడం మా ధర్మం. మా జీవనాధారం వారే. గాయపడిన చాలామందిని దవాఖానకు తీసుకుని వచ్చాం' అని తెలిపారు.

### కలలో కూడా ఊహించని శిక్షలు

**ఉగ్రవాదులకు ప్రధాని మోదీ హెచ్చరిక**

మధుబని(బీహార్): పహల్గాం ఉగ్రదాడి అనంతరం గురువారం మొట్టమొదటిసారి బహిరంగంగా స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు, దాడి వెనుక ఉన్న సూత్రధారులకు తీవ్రమైన హెచ్చరికలు జారీచేశారు. వారు కలలో కూడా ఊహించని కఠినమైన శిక్షలు అనుభవిస్తారని ప్రధాని హెచ్చరించారు. బీహార్‌లోని మధుబనిలో ఓ ర్యాలీని ఉద్దేశించిన ప్రసంగించిన మోదీ భారత దేశ స్ఫూర్తిపై దాడికి ప్రయత్నిస్తే సహించే ప్రసక్తి లేదన్న సందేశం యావత్ ప్రపంచానికి తెలియచేసే ఉద్దేశంతో ఇంగ్లిష్‌లోకి మాటాడారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి భారతదేశ ఆత్మపై జరిగిన దాడిగా ప్రధాని అభివర్ణించారు. 'ఈ దాడికి పాల్పడిన ప్రతి ఉగ్రవాదిని, దీని వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వేటాడి, శిక్షిస్తామని బీహార్ గడ్డపై నుంచి యావత్ ప్రపంచానికి ఈరోజు నేను తెలియచేస్తున్నాను. ఈ భూమిపై ఎక్కడ దాక్కున్నా వారిని పట్టుకుంటాం. ఉగ్రవాదంతో భారతదేశ స్ఫూర్తిని ఎన్నటికీ దెబ్బతీయలేరు' అని మోదీ ప్రకటించారు. ఉగ్రవాదులు కలలో కూడా ఊహించని విధంగా కఠినాతి కఠినమైన శిక్షలు ఉంటాయని మోదీ హెచ్చరించారు.

### పాక్ జాతీయులకు వీసా సర్వీసుల నిలిపివేత

**పాక్‌లోని భారతీయులు తక్షణమే రావాలని సూచన**

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడి దరిమిలా పాకిస్థాన్‌పై తీసుకున్న ప్రతీకార చర్యల కొనసాగింపుగా తక్షణమే పాకిస్థానీలకు వీసా సేవలను నిలిపివేస్తున్నట్లు భారత్ గురువారం ప్రకటించింది. పాకిస్థానీలకు జారీ చేసిన వీసాలన్నీ ఏప్రిల్ 27 నుంచి రద్దయినట్లేనని విదేశాంగ శాఖ ప్రకటించింది. పాక్ జాతీయులకు జారీచేసిన మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయని కేంద్రం తెలిపింది. వీసాల గడువు ముగిసేలోగా దేశంలో ఉన్న పాక్ జాతీయులందరూ భారత్‌ను వీడాలని ప్రభుత్వం ఆదేశించింది. పాక్‌లోని భారతీయులందరూ త్వరగా దేశానికి రావాలని కోరింది.




### మోదీ ఒక్క గంట అదనంగా కేటాయించలేరా?

న్యూఢిల్లీ: పహల్గాం దాడికి సంబంధించి నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి అన్ని పార్టీలను పిలవకపోవడం పట్ల ఏఐఎంఐఎం నేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది బీజేపీ అంతర్గత సమావేశం కాదని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలకు బలమైన, ఐక్య సందేశాన్ని ఇచ్చే సమావేశమని చెప్పారు. అలాంటి సమావేశానికి మోదీ అన్ని పార్టీల ఆందోళనలను వినడానికి ఒక గంట అదనంగా సమయాన్ని కేటాయించ లేరా? అని ప్రశ్నించారు. పార్టీ సైజుతో సంబంధం లేకుండా ఎన్నికైన ప్రతి ఎంపీకి తన వాక్కును విన్పించే హక్కు ఉందని ఆయన అన్నారు.



### గగనతలం మూసివేతతో ప్రయాణికులపై అదనపు భారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24 : పహల్గాం ఘటన అనంతరం పాకిస్థానపై భారత్ విధించిన ఆంక్షలకు ప్రతీకారంగా భారత్ నుంచి వచ్చే విమానాలకు ఆ దేశం తన గగనతలాన్ని మూసివేయడంతో ఆ ప్రభావం అంతర్జాతీయ విమాన సర్వీసులపై పడనుంది. ముఖ్యంగా ఢిల్లీ, ఇతర ఉత్తర ప్రాంత నగరాల నుంచి బయలుదేరే విమానాలు తాము చేరుకునే గమ్యస్థానాల దూరం పెరగనుంది. దీంతో రానున్న రోజుల్లో 8-12 శాతం విమాన చార్జీలు పెరిగే అవకాశం ఉంది. పాకిస్థాన్ చర్య తమ అంతర్జాతీయ విమాన సర్వీసులపై పడిందని ఎయిర్ ఇండియా, ఇండిగో గురువారం ప్రకటించాయి. ఈ రెండు సంస్థలతో పాటు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్‌లు కూడా అంతర్జాతీయ సర్వీసులను నిర్వహిస్తున్నాయి.




### హిందువు అని చెప్పగానే కాల్చి చంపారు

బెంగళూరు: అప్పటివరకు భార్య, పిల్లాడితో సంతోషంగా ఉన్న టెకీ భరత్‌ను కొద్ది క్షణాల్లోనే మృత్యువు ఉగ్రవాదుల రూపంలో కబళించింది. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారిలో కర్ణాటకలోని బెంగళూరుకు చెందిన టెకీ భరత్ భూషణ్ (35) కూడా ఉన్నారు. విహార యాత్రకు భార్య సుజాత, మూడేండ్ల కుమారుడితో పహల్గాంలోని బైసరన్ లోయలోకి వెళ్లిన భరత్‌ను ఉగ్రవాదులు మంగళవారం మధ్యాహ్నం అడ్డగించారు. అతని చేతిలో ఉన్న పిల్లాడిని భార్యకు అప్పగించమని చెప్పి నీ పేరు ఏంటని అడిగారు. భరత్ అని సమాధానం ఇచ్చిన అతడిని మతమేమిటని ప్రశ్నించారు. 'నేను హిందువుని' అని చెప్పగానే తన ఎదురుగానే తన భర్తను తలపై కాల్చి చంపారని అతని భార్య డాక్టర్ సుజాత విలపిస్తూ తెలిపింది.



### అక్కడ భద్రత ఎందుకు కల్పించ లేదు?

అహ్మదాబాద్: నిత్యం వందలాది మంది పర్యాటకులు వచ్చే పహల్గాం లాంటి ముఖ్యమైన పర్యాటక ప్రాంతంలో లేసమాత్రమైన భద్రత కూడా ఎందుకు లేదు? అక్కడ కనీసం చిన్నపాటి మెడికల్ కిట్ కూడా ఎందుకు అందుబాటులో లేదు? అని కాల్పుల్లో తన భర్తను కోల్పోయిన శీతల్‌బెన్ కథాలియా అనే బాధితురాలు ఆగ్రహంతో ప్రశ్నించింది. సూరత్ నివాసి అయిన శైలేష్ కథాలియాను అతని భార్య, కుమారుడి ఎదుటే టెర్రరిస్టులు కాల్చి చంపారు. తన భర్తను కాల్చిన అనంతరం ఆ ఉగ్రవాది నవ్వుతూ తన భర్త మరణించే వరకూ అక్కడే ఉన్నాడని శీతల్‌బెన్ తెలిపింది. అంతా అయిపోయిన తర్వాత అక్కడకు భద్రతా సిబ్బంది తాపీగా వచ్చారని అక్కడే ఉన్న ఆమె కుమారుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు.



### విద్వేషాన్ని సమైక్యంగా వ్యతిరేకిద్దాం

**శ్రీశ్రీ రవి శంకర్ పిలుపు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: జమ్ము కశ్మీరులోని పహల్గాంలో జరిగిన విషాద ఘటన పట్ల ఆర్ట్ ఆఫ్ లివింగ్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తమ సంతాపాన్ని తెలియచేస్తున్నట్లు తెలిపింది. ఇటువంటి క్షణాలలో బాధిత కుటుంబాలను ఓదార్చడానికి మాటలు అందవని, అయితే మన సమిష్టి స్ఫూర్తి అందించే బలమే గాయాన్ని మాన్పుతుందని గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ద్వేషానికి వ్యతిరేకంగా మనమంతా కలసి కట్టుగానిలబడి మన మానవత్వ గొంతుకను వినిపిద్దామని ఆయన పిలుపునిచ్చారు.